క్లుప్తంగా

బాటసారులకు మజ్జిగ పంపిణీ



మధురానగర్(విజయవాడసెంట్రల్): బీఆర్‌టీఎస్ రోడ్డులో సోమవారం హెల్పింగ్ టు గెదర్ 2009 గ్రూప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బాటసారులు, పాదచారులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్‌పర్సన్ కోరంగి నాగమల్లీశ్వరి, షఫీవుల్లా మాట్లాడుతూ వేసవి ఎండల నుంచి ఉపశమనం కోసం దాతలు, ట్రస్ట్ సభ్యుల సహకారంతో మజ్జిగ పంపిణీ చేస్తున్నామని తెలిపారు.అనంతరం 1800 మందికి మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ బ్రహ్మదేశం వసంతకుమార్, హేమంతరావు, హిరణ్య, శంకరరావు, కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

త్రిశక్తి పీఠం హుండీ ఆదాయం రూ.9.31లక్షలు



కృష్ణలంక(విజయవాడతూర్పు): నగరంలోని బస్టాండ్ సమీపంలోని శ్రీ కాళీ మాత అమ్మవారి దేవస్థానం(త్రిశక్తి పీఠం)లో హుండీల ద్వారా అమ్మవార్లకు భక్తులు సమర్పించిన కానుకలను సోమవారం లెక్కించారు. గత 150 రోజుల్లో భక్తులు సమర్పించిన కానుకలు లెక్కించగా రూ.9,31,565 ఆదాయం లభించింది. దేవదాయ శాఖ తరపున ఈవో ఎం.సత్యప్రసాద్ పర్యవేక్షణలో ఆలయ సూపరింటెండెంట్ ఎ.మధుసూదనరావు ఆధ్వర్యంలో భక్తుల సమక్షంలో కమిటీ సభ్యులు కానుకలు లెక్కించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష , కార్యదర్శులు జి.పుల్లయ్య, కె.జగదీష్‌కుమార్, ఆధ్యాత్మిక సలహాదారు బీహెచ్ విజయకిరణ్, సభ్యులు జి.సత్యనారాయణ, పి.విజయ్, విశ్వేశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

సంతాన సాఫల్య చికిత్సలపై ఫెర్టిజ్ఞాన్ 2024 సదస్సు



లబ్బీపేట(విజయవాడతూర్పు): సంతానలేమి సమస్యలు రోజు రోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ఆధునిక చికిత్సలపై అవగాహన పెంచుకునేందుకు ఫెర్టిజ్ఞాన్ 2024 పేరుతో సదస్సు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ సహకారంతో విజయవాడ ప్రసూతి, గైనకాలజికల్ సొసైటీ, ఫెర్టీ9 సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సులో వివిధ ప్రాంతాలకు చెందిన 182 మందికిపైగా వైద్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంతానోత్పత్తి సంరక్షణ, వివిధ అంశాలపై సమగ్ర చర్చలు జరిగాయి. విశిష్ట వక్తలు ప్రీ కాన్సెప్షన్ కౌన్సెలింగ్, సంరక్షణ, వంధత్వంలో జీవక్రియ ఆరోగ్యం పాత్ర, సంతానోత్పత్తిలో కీ హోల్ సర్జరీ, ఏఆర్‌టీ చట్టం, గైనకాలజిస్టుల దృక్పథం వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చలు జరిపారు. ఇటీవల పురోగతి, పురుష భాగస్వామి మూల్యాంకనం, మెరుగైన ఫలితాలు కోసం కచ్చితత్వం, వంధత్వంలో అల్ట్రాసోనోగ్రఫీ వినియోగంపై చర్చలు జరిగాయి. ఈ కార్యక్రమంలో సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ సుమ వర్ష సంతానోత్పత్తిలో పురోగతిని వివరించారు. ఆర్గనైజింగ్ చైర్‌పర్సన్ డాక్టర్ జ్యోతి సి బుడితో పాటు పలువురు నిపుణులు విశ్లేషణాత్మక సందేశాలు ఇచ్చారు.

కళాకారులు సాంస్కృతిక ప్రతినిధులు



విజయవాడకల్చరల్: కవులు, కళాకారులు సాంస్కృతిక ప్రతినిధులని వారి కోసం కళా సంస్థలు, ప్రభుత్వాలు కృషి చేయాలని హనుమంతరాయ గ్రంథాలయం అధ్యక్షుడు డోగిపర్తి శంకరరావు అన్నారు. కళాకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో సోమవారం కళాకారుల ఆత్మీయ సదస్సు జరిగింది. సభకు అధ్యక్షత వహించిన డోగిపర్తి శంకరరావు మాట్లాడుతూ హనుమంతరాయ గ్రంథాలయం ద్వారా కళాకారుల సంక్షేమం కోసం కృషి చేస్తునట్లు తెలిపారు. రంగస్థల నటుడు, దర్శకుడు సూర్యదేవర జగన్నాధరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని కళాకారులు ఐక్యం కావాల్సిన అవసరముందన్నారు. కళాకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, వారికి ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని, ఆడిటోరియం నిర్మించాలని కోరారు. దృశ్యవేదిక ప్రతినిధి హెచ్‌వీఆర్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ కళాకారులలో ఐక్యత కోసం కృషి చేయాలన్నారు. సమావేశంలో ఆంధ్రా ఆర్ట్స్ అకాడమీ కార్యదర్శి నంది వాడ నాని, రంగస్థల నటుడు వేమూరి నాగేశ్వర శర్మ, వివిధ సంస్థల ప్రతినిధులు బొర్రా నరేస్, బాయన శ్రీనివాసరావు, పీవీఎల్ నృసింహం కళాకారుల సంక్షేమం అంశంగా తమ అభిప్రాయాలను తెలియజేశారు.

వైఎస్సార్ సీపీ ద్వారానే అభివృద్ధి సాధ్యం

సెంట్రల్ వైఎస్సార్ సీపీ అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు



1వ డివిజన్ పరిధిలోని గుణదలలో ఎన్నికల ప్రచారం చేస్తున్న సెంట్రల్ అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు

గుణదల(విజయవాడ తూర్పు): ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా సీఎం జగన్ మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని సెంట్రల్ ఎమ్మెల్యే అభ్యర్థి వెల్లంపల్లి శ్రీనివాస్ అన్నారు. గుణదల 1వ డివిజన్ పరిధిలో ఆయన సోమవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా సంక్షేమ పాలన అందించడంలో సీఎం జగన్ సఫలీకృతులయ్యారని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. సెంట్రల్ నియోజకవర్గం పరిధిలోని 1వ డివిజన్‌లో పర్యటించానని, ఈ డివిజన్‌లో కాల్వ గట్టు ప్రాంతాల్లో ఉన్న పేదలందరికీ ప్రభుత్వం అందించే పథకాలు సక్రమంగా అందుతున్నాయని చెప్పారు. అమ్మ ఒడి, వాహన మిత్ర, రైతు భరోసా వంటి పథకాలతో పాటు అర్హులైన వారందరికీ పింఛన్లు సక్రమంగా చేరుతున్నాయని వివరించారు. ప్రభుత్వం అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలే తిరిగి పార్టీని గెలిపిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. దీనికి తోడు ఇటీవల సీఎం జగన్‌మోహన్ రెడ్డి విడుదల చేసిన మేనిఫెస్టో ఆమోదయోగ్యంగా ఉందన్నారు. కొన్ని సంక్షేమ పథకాలు పెంచుతూ, మిగతావన్నీ కొనసాగిస్తూ సీఎం జగన్ చేసిన ప్రకటన హర్షణీయమన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు పరుస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో 1వ డివిజన్ పరిధిలోని హనుమాన్ నగర్‌లో ప్రచారం నిర్వహించారు. కార్పొరేటర్లు ఉద్దంటి సునీత, వెంకట సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు కొండా మహేశ్వరరెడ్డి, ఆళ్ల ప్రసాద్ రెడ్డి, శివ, వేణు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్ద పింఛను ఇవ్వకుండా అడ్డుకున్న చంద్రబాబు

పాయకాపురం(విజయవాడరూరల్): అవ్వాతాతలకు ఇంటి వద్ద పింఛను ఇవ్వకుండా చంద్రబాబు అడ్డుకున్నాడని ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం సాయంత్రం 64వ డివిజన్ వినాయకుడి గుడి ప్రాంతంలో, బర్మా కాలనీల్లో వెలంపల్లి శ్రీనివాసరావు గడప గడపకు వెళ్లి ఫ్యాను గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని ఓటర్లను కలిసి ఓట్లు అభ్యర్థించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబుకు కోపం ఉంటే తమపై చూపాలని, పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులపై కాదన్నారు. చంద్రబాబు పుణ్యమా అని ఈ ఒక్క నెల ఇబ్బందులు తప్పవని, వచ్చే నెల నుంచి తిరిగి వలంటీర్లు ఇంటి వద్దకే వచ్చి పెన్షన్లు పంపిణీ చేస్తారన్నారు. మళ్లీ అధికారంలోకి వచ్చేది వైఎస్సార్‌సీపీయే అని వెలంపల్లి తెలిపారు.



64వ డివిజన్‌లో వృద్ధురాలితో మాట్లాడుతున్న వెలంపల్లి శ్రీనివాసరావు

వైఎస్సార్ సీపీ పాలనలోనే డివిజన్ అభివృద్ధి

టీడీపీ పాలనలో నిర్లక్ష్యానికి గురైన 64వ డివిజన్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పిమ్మట కోట్లాది రూపాయల అభివృద్ధి జరిగిందన్నారు. ప్రతి ఇంట్లో సీఎం జగన్ సంక్షేమ పథకాలు అందాయన్నారు. సీఎం జగన్ మళ్లీ గెలిస్తేనే పథకాలు వస్తాయనే విషయాన్ని స్థానికులు చెబుతున్నారన్నారు. పేదవారి అభ్యున్నతికి పెద్దపీట వేసిన ప్రభుత్వం జగన్ ప్రభుత్వమన్నారు. రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి వచ్చేది వైఎస్సార్‌సీపీ అన్నారు. పర్యటనలో ప్రజల నుంచి అపూర్వమైన స్వాగతం లభించింది. మహిళలు వెలంపల్లికి హారతులు పట్టి స్వాగతం పలికారు. పర్యటనలో స్థానిక కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ, కోఆప్షన్ సభ్యుడు ఎస్.జగదీష్, కోఆర్డినేటర్ షేక్ ఇస్మాయిల్, పార్టీ నాయకులు యరగొర్ల శ్రీరాములు, కొక్కిలిగడ్డ నాని, పందిరి వాసు, డాక్టర్ చిన్నా, వెంకటేశ్వరమ్మ, చిన్నారి, కుమారి, మాతా మహేష్, రామకృష్ణ, పలువురు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

బొట్టు పెట్టి, చేతులు జోడించి...

27వ డివిజన్‌లో సిద్ధం శ్రీనన్న సైనికుల కమిటీ వినూత్న ప్రచారం



బొట్టుపెట్టి ఓట్లు అభ్యర్థిస్తున్న శీలం భవానీ రెడ్డి తదితరులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): 27వ డివిజన్ గులాబీతోటలో సోమవారం 27వ డివిజన్ సిద్ధం శ్రీనన్న సైనికుల కమిటీ ఆధ్వర్యాన బొట్టుపెట్టి, చేతులు జోడించి ఓటు వేయాలంటూ వినూత్న ప్రచారం నిర్వహించారు. శ్రీనన్న సైనికుల కమిటీ ప్రతి ఇంటికీ వెళ్లి జగనన్న ప్రవేశ పెట్టిన ప్రజా మేనిఫెస్టో సంక్షేమ పథకాలను వివరిస్తూ మహిళలకు బొట్టు పెట్టి చేతులు జోడించి ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి వెలంపల్లి శ్రీనివాసరావు, కేశినేని నానిలను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా శ్రీనన్న సైనికుల కమిటీ సభ్యులు కురిటి శివ, శీలం భవానీ రెడ్డి, యర్రంశెట్టి శ్రీను మాట్లాడుతూ తాము ప్రతి గడపకూ వెళ్లి ప్రతి ఓటర్‌ను కలిసి చేసిన మంచిని వివరించి చేతులు జోడించి వినయపూర్వకంగా ఓట్లు అభ్యర్థిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర భవిష్యత్తు జగన్‌తోనే సాధ్యమనే నమ్మకంతో తాము కమిటీగా ఏర్పడి వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు లంకా కుమార్, కాటూరి కృష్ణ, కనక లింగేశ్వరరావు, పురమా శ్రీధర్, చందు, దుర్గారావు, అప్పారావు, కాజా, రవి వర్మ, గులాబీతోట అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.



దావు బుచ్చయ్యకాలనీలో ఓట్లు అభ్యర్థిస్తున్న మంచుకొండ చక్రవర్తి, కాజ రఘునాథం

దావు బుచ్చయ్య కాలనీలో...

30వ డివిజన్ దావు బుచ్చయ్యకాలనీలో సోమవారం సాయంత్రం వెలంపల్లి శ్రీనివాసరావు అల్లుడు మంచుకొండ చక్రవర్తి, కేశినేని నాని అల్లుడు కాజా రఘునాథం స్థానిక కార్పొరేటర్ బీహెచ్ఎస్‌వీ జానారెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గడప గడపకు వెళ్లి ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి వెలంపల్లి శ్రీనివాసరావు, కేశినేని నానిలను గెలిపించాలని అభ్యర్థించారు. ఏ సదుపాయాలూ లేని ఈ ప్రాంతంలో అన్ని వసతులు కల్పించామని, చేసిన అభివృద్ధిని చూసి ఓట్లు వేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

బుడమేరు మధ్య కట్టలో...

బుడమేరు మధ్య కట్టలో సోమవారం స్థానిక కార్పొరేటర్ బీహెచ్ఎస్‌వీ జానారెడ్డి వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుడమేరు మధ్యకట్టలో తాగునీరు సరఫరా చేశామని, రోడ్లు వేశామని, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేశామని గుర్తు చేశారు. కాల్వగట్ల వాసులకు అండగా ఉంటామని, ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి వెలంపల్లి శ్రీనివాసరావు, కేశినేని నానిలను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

మేధో సంపత్తి హక్కుల ద్వారా విస్తృత ఆదాయం



మాట్లాడుతున్న అజిత్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మేధో సంపత్తి హక్కులపై అవగాహన పెంచుకోవటం ద్వారా విస్తృతమైన ఆదాయాన్ని పొందవచ్చని కేంద్ర పేటెంట్స్ అండ్ డిజైన్స్ జాయింట్ కంట్రోలర్ (చెన్నై) ఎం.అజిత్ అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల ఫిజిక్స్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఐక్యూఏసీ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో 'మేధో సంపత్తి హక్కులు' అంశంపై వర్క్‌షాప్‌ను సోమవారం ఆ కళాశాల సెమినార్ హాల్‌లో నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌కు ముఖ్యవక్తగా హాజరైన అజిత్ మాట్లాడుతూ మేధో సంపత్తి హక్కులపై భారతదేశంలో చాలా వెనుకబాటు ఉందన్నారు. దేశానికి చెందిన అనేక ఉత్పత్తులపై ఇతర దేశాలు పేటెంట్లు పొందటం ద్వారా హక్కులను సాధించి ఆదాయాన్ని పొందుతున్నాయన్నారు. వివిధ సంస్థలు, వ్యక్తులు వారు రూపొందించిన ఆవిష్కరణలు, ఉత్పత్తులపై వారికి హక్కులు ఉంటాయన్నారు. వీటిని అధికారికంగా నమోదు చేయించుకోవటం ద్వారా ప్రపంచ వ్యాప్తంగా మేధో సంపత్తి హక్కులను పొందవచ్చన్నారు. ఈ విధమైన అంశాలపై అవగాహన కొరవడటం వలన చాలా విలువైన ఆదాయాన్ని భారతదేశం కోల్పోతోందన్నారు. మన దేశానికి మాత్రమే చెందిన అనేక ఉత్పత్తులను సైతం ఇతర దేశాలు తమవిగా చలామణి చేసుకుంటున్నాయని వివరించారు. ఈ విధమైన హక్కులపై అవగాహన కలిగి ఉండటం ద్వారా వ్యక్తిగతంగా, సంస్థలకు, దేశానికి కూడా ఆదాయం సమకూరుతుందన్నారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ మేధో సంపత్తి హక్కులకు సంబంధించి మరింత లోతైన చర్చలు జరగాలన్నారు. వాటిపై విద్యార్థులు అధ్యాపకులు అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ ఎం.వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ జి.కృష్ణవేణి, విభాగాధిపతి ఆర్.ఉదయ్‌కుమార్, అధ్యాపకులు బి.శృతి తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వజ్రాయుధం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు):ఓటు హక్కు వజ్రాయుధం వంటిదని జనశిక్షణ సంస్థాన్ చైర్‌పర్సన్ నాగళ్ళ విద్యాకన్నా చెప్పారు. స్థానిక రావిచెట్టు సెంటర్ సమీపంలో ఉన్న జనశిక్షణ సంస్థాన్ కార్యాలయం ఆవరణలో ఓటు హక్కు వినియోగంపై సోమవారం సదస్సు నిర్వహించారు. సంస్థ డైరెక్టర్ పూర్ణిమ, జనశిక్షణ సంస్థాన్ సిబ్బంది, రిసోర్స్ పర్సన్స్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించండి

61వ డివిజన్‌లో నేతల ప్రచారం



61వ డివిజన్లో ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పాయకాపురం(విజయవాడరూరల్): సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓట్లు వేసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఉమ్మడి వెంకట్రావ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం 61వ డివిజన్ ప్రశాంతి నగర్‌లో ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల బ్రోచర్లను అందజేశారు. సంక్షేమ పథకాల అమలు కొనసాగేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు, ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్(నాని)లను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో డివిజన్ కోఆర్డినేటర్ నాలం బాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు మలమంటి అనిల్‌బాబు, మాలకొండయ్య, నాగిరెడ్డి, శివ, సాయి, మధు పాల్గొన్నారు.

తుదిదశకు చేరిన కర్మల భవనం అభివృద్ధి పనులు

రూ.9 లక్షలతో అభివృద్ధి పనులు



ముత్యాలంపాడు కర్మల భవనం

మధురానగర్(విజయవాడసెంట్రల్): 31వ డివిజన్ పరిధిలోని ముత్యాలంపాడులో కర్మల భవనం అభివృద్ధి పనులు తుది దశకు చేరుకున్నాయి. గత ప్రభుత్వ హయాంలో తీవ్ర నిర్లక్ష్యం కారణంగా ఇక్కడ కర్మల భవనం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో ఇక్కడ కార్యక్రమాలు నిర్వహించుకునే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొంతమంది కర్మకాండలు నిర్వహించుకునేందుకు వేరే ప్రాంతాలకు వెళ్లిపోతున్నారు. దీంతో ఈ సమస్యను స్థానిక కార్పొరేటర్ పెనుమత్స శిరీష ఎమ్మెల్యే మల్లాది విష్ణు దృష్టికి తీసుకువెళ్లారు. మల్లాది విష్ణు అధికారులతో మాట్లాడి తగు చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు.

దీంతో రూ.9లక్షల వ్యయంతో శిథిలావస్థకు చేరిన కర్మల భవనానికి మరమ్మతు పనులు చేపట్టారు. ఈ పనులు తుది దశకు చేరుకున్నాయి. ప్రస్తుతం సీలింగ్, విద్యుత్ పనులు జరుగుతున్నాయి. సాధ్యమైనంత త్వరలోనే పనులు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకువస్తామని అధికారులు చెబుతున్నారు. శిథిలావస్థకు చేరుకున్న కర్మల భవనాన్ని సుందరంగా తీర్చిదిద్దినందుకు స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఓటు హక్కుతోనే ప్రజాస్వామ్య మనుగడ



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఓటు హక్కును వినియోగించుకోవటం ద్వారా ప్రజాస్వామ్య మనుగడకు ప్రజలందరూ అండగా ఉండాలని విజయవాడ హోల్‌సేల్ అండ్ రిటైల్ పూజా మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గోకవరపు మురళీకృష్ణ, ఎం.కృష్ణారావు తెలిపారు. ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరుతూ అవగాహన ర్యాలీని సోమవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా సామారంగంచౌక్ నుంచి బయలుదేరిన ప్రదర్శన మొయిన్‌బజార్, శివాలయంవీధి, కెనాల్‌రోడ్డు తదితర ప్రాంతాల మీదుగా ముందుకు సాగింది. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గోకవరపు మురళీకృష్ణ, కృష్ణారావు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో దేశ సాధారణ ఎన్నికల్లో పౌరులందరూ లింగ, వర్ణ, కులమతాలకు అతీతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఎన్నికల రోజును శెలవు రోజుగా కాకుండా చాలా కీలకమైన రోజుగా భావించాలని తెలిపారు. ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరుతూ తమ సంఘం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించామని పేర్కొన్నారు.

సెంట్రల్ బరిలో 20 మంది అభ్యర్థులు

- నలుగురు ప్రధాన పార్టీల అభ్యర్థులు
- ఏడుగురు ఇతర పార్టీల అభ్యర్థులు
- 9 మంది స్వతంత్ర అభ్యర్థులు



వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు



టీడీపీ అభ్యర్థి బొండా ఉమామహేశ్వరరావు



సీపీఎం అభ్యర్థి చిగురుపాటి బాబూరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ ఎన్నికల బరిలో 20 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. మొత్తం 26 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. వీరిలో 22 మంది నామినేషన్లు ఆమోదం పొందాయి. ఇద్దరు అభ్యర్థులు తమ నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. చివరికి బరిలో 20 మంది అభ్యర్థులు మిగిలారు. వీరిలో ప్రధాన పార్టీల అభ్యర్థులు వెలంపల్లి శ్రీనివాసరావు(వైఎస్సార్ సీపీ), బొండా ఉమామహేశ్వరరావు(టీడీపీ), ఐ.రాజేంద్రప్రసాద్(బీఎస్పీ), చిగురుపాటి బాబూరావు (సీపీఎం) ఎన్నికల్లో తలపడుతున్నారు. గొల్లపల్లి శ్రీ ఫణిరాజ్(ఆంధ్ర రాష్ట్ర ప్రజా సమితి పార్టీ), త్రినాథ్ స్వామి బుంగా (పిరమిడ్ పార్టీ), ప్రశాంత్ కుమార్(నవరంగ్ కాంగ్రెస్ పార్టీ), జి.శివశంకర్ (జాతీయ జనసేన పార్టీ), శ్రీధర దక్షిణామూర్తి(జై భారత్ నేషనల్ పార్టీ), ఎల్.హిమవద్వతి(ఎస్‌సీయూఐ, కమ్యూనిస్టు), స్వతంత్ర అభ్యర్థులుగా కొణిజేటి ఆదినారాయణ, చంద్రశేఖర్ పెదపాటి, వి.జయ పూర్ణచంద్రరావు, దాసరి నాగరాజు, దుగ్గిశెట్టి సుభాషిణి, బొప్పన గాంధీ, వెంకట సాయి లక్ష్మీ గణేష్, మన్నం రాజశేఖర్, రామలింగేశ్వరరావు జొన్నవిత్తుల, వంటి కొమ్ము భూపాల్ రెడ్డి పోటీలో ఉన్నారు.

గొల్లపల్లి ఫణిరాజ్‌కు గాజుగ్లాసు గుర్తు

ఆంధ్ర రాష్ట్ర ప్రజా సమితి అభ్యర్థి గొల్లపల్లి ఫణిరాజ్‌కు ఎన్నికల కమిషన్ గాజుగ్లాసు గుర్తు కేటాయించింది. ఎన్నికల ప్రక్రియలో మరో ప్రధాన ఘట్టం ముగిసింది. బరిలో ఉన్న అభ్యర్థుల తుది జాబితా వెల్లడైంది. ఇక ప్రచారానికి కేవలం 12 రోజులు మాత్రమే ఉండటంతో ప్రధాన పార్టీల అభ్యర్థులంతా మంగళవారం నుంచి తమ ప్రచారాలను ముమ్మరం చేయనున్నారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు ఇప్పటికే ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు.

వాంబే కాలనీలో కేశినేని నాని సతీమణి ప్రచారం



వైఎస్సార్‌సీపీ పథకాల గురించి ప్రజలకు వివరిస్తున్న కేశినేని పావని, శ్రీలక్ష్మి తదితరులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్‌సీపీ విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని నాని సతీమణి కేశినేని పావని, సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు సోదరుడు, ఆయన సతీమణి శ్రీలక్ష్మి స్థానిక 60వ డివిజన్ వాంబే కాలనీలో సోమవారం సాయంత్రం పర్యటించారు. కాలనీలో ఇంటింటికీ తిరిగి స్థానిక ప్రజలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలన్నా, అన్ని వర్గాల ప్రజలకు ఉజ్వల భవిష్యత్తు అందించాలన్నా ప్రజలంతా మళ్లీ జగనన్న ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ఫ్యాను గుర్తుపై ఓటు వేసి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బెవర నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి తిరిగి పట్టం కట్టాలి



29వ డివిజన్‌లో ఓట్లు అభ్యర్థిస్తున్న కేశినేని పావని, వెలంపల్లి రామకృష్ణ, శ్రీలక్ష్మి, లక్ష్మీపతి

మధురానగర్(విజయవాడసెంట్రల్): పేదల సంక్షేమం కోసం అహర్నిశలు కృషిచేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి తిరిగి పట్టం కట్టాలని ఎంపీ కేశినేని నాని సతీమణి కేశినేని పావని, సెంట్రల్ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు సోదరుడు వెలంపల్లి రామకృష్ణ, వెలంపల్లి శ్రీలక్ష్మి విజ్ఞప్తిచేశారు. స్థానిక మధురానగర్ సాయిబాబా కాలనీలో సోమవారం కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి, వైఎస్సార్ సీపీనాయకులు అభిమానులతో కలిసి ఎన్నికలప్రచారం నిర్వహించారు. గడపగడపకు వెళ్లి ప్రభుత్వం అందించిన పథకాలు సంక్షేమం, నవరత్నాల గురించి వివరిస్తూ ఫ్యాను గుర్తుకు ఓట్లు వేయాలని అభ్యర్థించారు. అనుక్షణం ప్రజల మంచిని కోరే వెలంపల్లి శ్రీనివాసరావు, కేశినేని నానికి ఓట్లువేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. దారి పొడవునా మహిళలు, పలు పథకాల లబ్ధిదారులు హారతులు ఇస్తూ స్వాగతం పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కంభం కొండలరావు, కొండపల్లి బుజ్జి, కోలా రమేష్, గోవిందు, రాజేష్, అక్బర్, రాష్ట్ర మహిళా నాయకురాలు పిల్లి కృష్ణవేణి, పూర్ణిమ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

భానూనగర్‌లో...

28వ డివిజన్ భానూనగర్‌లో సోమవారం వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి కసపర్తి కొండలరావు వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేసిన మంచిని వివరించి ఫ్యాను గుర్తుకు ఓట్లు వేయాలని అభ్యర్థించారు. కులమతాలు, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆదరించాలని కోరారు.

నెరవేరిన చిరకాల వాంఛ

- అందుబాటులోకి మధురానగర్ ఆర్‌యూబీ
- రాకపోకలకు అనధికారికంగా అనుమతి
- ఎన్నికల కోడ్ కారణంగా అధికారిక ప్రారంభం వాయిదా
- ఐదు డివిజన్ల ప్రజల హర్షాతిరేకాలు



ఆర్‌యూబీ వద్ద కార్పొరేటర్ పెనుమత్స శిరీష, సత్యం తదితరులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరంలోని ఐదు డివిజన్ల వాసుల చిరకాల వాంఛ అయిన మధురానగర్ ఆర్‌యూబీ సోమవారం నుంచి అనధికారికంగా అందుబాటులోకి వచ్చింది. నగరపాలక సంస్థ అధికారులు ఆర్‌యూబీ తుది దశ పనులు పూర్తిచేసి సోమవారం రాకపోకలకు అనుమతించారు. అయితే ఎన్నికల కోడ్ కారణంగా అధికారిక ప్రారంభం వాయిదా పడింది. ఆర్‌యూబీ ద్వారా రాకపోకలకు అనుమతించటంతో నగరంలోని ఒకటో డివిజన్‌తో పాటు, 28, 29, 30, 31 డివిజన్ వాసులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ ఆర్‌యూబీ పనులు కోవిడ్, సాంకేతిక కారణాలతో జాప్యం జరగటంతో స్థానికులు రాకపోకలకు తీవ్ర అవస్థలు పడ్డారు. అయితే ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాసరావు అధికారులతో మాట్లాడి పనులు వేగవంతం చేయించటంతో పాటు రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకునేలా చేశారు. సోమవారం 31వ డివిజన్ కార్పొరేటర్ పెనుమత్స శిరీష ఆర్‌యూబీ ద్వారా స్వయంగా రాకపోకలు సాగించి ఆర్‌యూబీ పనులను పరిశీలించారు.

సిటీ బస్సులు పునరుద్ధరించాలి

ఆర్‌యూబీ పనులలో భాగంగా మధురానగర్‌కు నిలిపివేసిన సిటీ బస్సులను పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు. ఆర్‌యూబీ వల్ల రైల్వేగేటు కష్టాలు తీరటంతో పాటు ట్రాఫిక్ సమస్యలు తగ్గుతాయని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అప్పారావు మృతి తీరనిలోటు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, విజయవాడ వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మూకల అప్పారావు (62) మృతి ఉపాధ్యాయ సంఘాలకు, వెలమ సంక్షేమ సంఘానికి తీరని లోటు అని పలువురు నాయకులు అన్నారు. ఈ నెల 22న విజయవాడలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్రమైన గాయం కావడంతో నగరంలోని ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ అప్పారావు ఆదివారం రాత్రి మృతి చెందారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
విజయవాడ సెంట్రల్ :
9010201611
Office mail : sakshiads@gmail.com